ప్రజలారా!

హక్కుల సంఘాలంటే పోలీసులను విమర్శించే సంఘాలనేది బాగా ప్రాచుర్యం పొందిన అభిప్రాయం.

పోలీసు అత్యాచారాల నుండి ప్రజల హక్కులకు రక్షణ కల్పించడానికి కృషి చేయడం హక్కుల ఉద్యమానికి ఉండే ఒక తప్పని సరి బాధ్యతే.

అయినప్పటికీ అదొక్కటే హక్కుల ఉద్యమం కర్తవ్యం కాదు. దానితోనే హక్కుల ఉద్యమం పని అయిపోదు.

అనేక విషయాల గురించి హక్కుల సంఘాలు మాట్లాడుతుంటాయి. ప్రాజెక్టులు కట్టినప్పుడూ రోడ్లు బలవంతంగా వెడల్పు చేసినప్పుడూ ఇల్లూ, పొలమూ కోల్పోయే వారికి పునరావాసం కల్పించాలనీ, బోరునీళ్ళు తప్ప వేరే గత్యంతరం లేని రైతులకు ప్రభుత్వం నిన్నటి దాకా ఇచ్చిన కరెంటు సబ్సిడీ ఎత్తి వేయకూడదనీ, హక్కుల సంఘాలు అడుగుతుంటాయి. ఇవి ఆర్థిక హక్కుల కోవలోకి వచ్చే హక్కులు.

దళితులపైన దౌర్జన్యాలు చేసే వారిని, అంటరానితనం పాటించే వారినీ నిజాయితీగా విచారించి శిక్షించాలనీ, బలహీన వర్గాలకు రాజ్యాంగం ఇచ్చిన స్వల్పమైన హక్కులను అతిక్రమించే బలవంతులను కట్టడి చేయాలనీ అందులో భాగంగా ఎస్.సి., ఎస్.టి. (అత్యాచారాల నిరోధక) చట్టాన్ని ఖచ్చితంగా అమలు చేయాలనీ డిమాండ్ చేస్తుంటాయి. అసమాన వేతనాలు, లైంగిక వేధింపులు, కుటుంబ వేధింపులకు గురయ్యే స్త్రీల హక్కుల గురించి, వాటికి భరోసా ఇచ్చే చట్టాల అమలు గురించి ఆందోళన చేస్తుంటాయి. ఇవి సామాజిక స్వభావం గల హక్కులు.

తమ సమస్యలను చెప్పుకొనడానికీ, చర్చించుకోవడానికీ పరిష్కారాలు వెతుక్కోవడానికీ ప్రజలకు స్వేచ్ఛ ఉండాలని హక్కుల సంఘాలు అడుగుతుంటాయి. ప్రజల గొంతు నొక్కేసే నిర్బంధ చట్టాలను, 'వేర్పాటు వాదం' 'విచ్ఛిన్నకర వాదం' 'తీవ్రవాదం' మొదలయిన నిందలు వేసి పాలకులకు నచ్చని రాజకీయాలకు బురదపూసే ప్రయత్నాలను హక్కుల సంఘాలు వ్యతిరేకిస్తాయి. ఇది రాజకీయ హక్కుల సమస్య.

అంటే పోలీసు అత్యాచారాల గురించే కాక, సకల ఆర్థిక, సామాజిక, రాజకీయ హక్కుల గురించి కూడా హక్కుల సంఘాలు ఆవేదన చెందుతాయి, ఆందోళన చేస్తాయి.

ఎందుకు ఆందోళన చేస్తాయి? దీని వెనక ఉన్న తాత్విక దృక్పథం ఏమిటి? ఆ తాత్విక దృక్పథం ఎక్కడ పుట్టింది? ఏ క్రమంలో రూపం తీసుకునింది?

పోలీసులు మాత్రమే హత్యలు చేస్తున్నారా? వేరే ఎవ్వరూ చేయడం లేదా? మమ్మల్ని మాత్రమే ఎందుకంటారు? అని పోలీసులు అడుగుతుంటారు. దళితుల హక్కుల గురించి మాట్లాడుతారు గానీ వాళ్లు చేసే తప్పుల సంగతేమిటి? అని పెత్తందారీ కులాల వాళ్లు అంటుంటారు. అడవిలో హక్కులన్నీ ఆదివాసీలకేనా? ఇతర పేద ప్రజలకు హక్కులు ఉండవా? అని సవాళ్లు విసురుతుంటారు. భార్యలను హింసించే భర్తలేనా, భర్తలను వేదించే

భార్యలు లేరా? అని ఆవేశపడుతుంటారు. మైనారిటీలు, మైనారిటీలూ అంటూ ముస్లింల హక్కుల గురించి మాత్రమే ఎంతసేపూ ఆందోళన చేస్తుంటారు, మెజారిటీ అయిన హిందువులకు హక్కులుండవా అని మరీ ఆవేశపడుతుంటారు. ఈ సందేహాలకూ, సవాళ్లకూ హక్కుల ఉద్యమం ఏం జవాబు చెప్తుంది? ఏక పక్షంగా కన్పించే తన ఆచరణను ఏ విధంగా వివరిస్తుంది?

ఇప్పుడు కొన్ని సంవత్సరాలుగా మనదేశంలో ప్రభుత్వాలు - ఈ పార్టీ ఆ పార్టీ అన్న తేడా లేకుండా అనుసరిస్తున్న ప్రపంచీకరణ విధానాలు అన్ని హక్కులకూ గొడ్డలిపెట్టు అని హక్కుల సంఘాలు అంటున్నాయి. కానీ ఆ విధానాలే దేశానికి అభివృద్ధి తెచ్చిపెడతాయని చంద్రబాబు వంటి పాలకులు అంటున్నారు. అయితే అభివృద్దే వద్దని హక్కుల సంఘాలు అంటున్నాయా? లేక అభివృద్ధికి హక్కుల నిర్వచనం ఇస్తున్నాయా?

ఆ ప్రశ్నలకు జవాబులు వెతుక్కోకుండా, చర్చించుకోకుండా హక్కుల ఉద్యమం ప్రజా చైతన్యంలో వేళ్లూన జాలదు. ఎదగజాలదు, పురోగమించజాలదు.

అందుకే ఈ అధ్యయన తరగతులకు వచ్చి వినమనీ, చర్చించమనీ నచ్చితే మా సంస్థలో చేరి హక్కుల ఉద్యమాన్ని బలోపేతం చేయమనీ మెదక్ జిల్లాలోని ప్రజాస్వామ్య ప్రియులందరినీ ఆహ్వానిస్తున్నాం.

మానవహక్కుల వేదిక

మెదక్ జిల్లా

# మానవ హక్కుల అధ్యయన తరగతులకు అందరికీ ఆహ్వానం

**9 -3-2002 శనివారం ఉదయం 10 గంటల నుండి**

**మెదక్ పట్టణంలోని గుల్షన్ క్లబ్ హాలు లో**

**మొదటి అంశం: హక్కుల ఉద్యమం చరిత్ర**

అధ్యక్షత: బట్టీ భూపతి కార్మిక నాయకులు

వక్త: డా॥ బుర్రరాములు కె.యు.

**రెండవ అంశం: ప్రపంచీకరణ - మానవ హక్కుల**

**తెలంగాణ ఉద్యమం నేపథ్యంలో**

అధ్యక్షత: టి. సత్యనారాయణ ఎ.పి.టి.ఎఫ్.

వక్త:- డా॥ ఎం. కోదండరాం ఒ.యు.

**మూడవ అంశం: హక్కుల ఉద్యమం తాత్విక దృక్పథం**

అధ్యక్షత: చాగంటి హరి హెచ్.ఆర్.ఎఫ్.

వక్త: - డా॥ కె. బాలగోపాల్ న్యాయవాది

భోజన సదుపాయం కలదు.

శ్రీ ..............................................................................

..............................................................................

.............................................................................. గారికి

**HUMAN RIGHTS FORUM**

**MADAK (Dt)**